క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక


జశ్వంత్‌తో పీడీ ప్రవీణ్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థి జశ్వంత్ గజ్వేల్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొని నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల చివరి వారంలో మహబూబ్‌నగర్‌లో జరిగే అండర్ 19 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా జశ్వంత్‌ను ప్రిన్సిపాల్ సతీశ్, పీడీ ప్రవీణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

కెనాల్ ముంపుపై నేడు గ్రామసభ

తహసీల్దార్ సురేఖ

కోహెడ(హుస్నాబాద్)/కోహెడరూరల్(హుస్నాబాద్): స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేఖ తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ కింద భూములు కోల్పోతున్న కోహెడ రెవెన్యూ పరిధిలోని వెంకటేశ్వర్లపల్లి, తీగలకుంటపల్లి, సోమవారంపల్లి, వెల్దండిపల్లి, చెంచ్‌లచెర్వుపల్లి, కాచాపూర్‌కు చెందిన రైతులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. గ్రామసభలో తమ అభ్యంతరాలు, ఆక్షేపణలు వివరించాలని సూచించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో..

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ పరిధిలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రంగనాయక్ సాగర్ కుడికాలువ నిర్మాణం కింద భూములు కోల్పోతున్న రైతులు గ్రామంలో నిర్వహించే గ్రామసభకు హాజరుకావలని తహసీల్దార్ సురేఖ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ హుస్నాబాద్ ఆర్డీఓ రామూర్తి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహిస్తామని సర్వే నంబర్ వారీగా భూములు కోల్పోతున్న రైతులు తమ అభ్యంతరాలను ఉంటే తెలియజేయవచ్చన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు భరోసా


చెక్కు అందజేస్తున్న కిరణ్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): సీఎం సహాయనిధి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.లక్ష విలువైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): లగచర్ల ఘటనలో అక్రమంగా గిరిజనులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మాలోతు భీలునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవనాధారమైన పచ్చని పంట పొలాలు పోతున్నాయన్న బాధతో రైతులు ఆందోళన తెలపటంతో తోపులాట మాత్రమే జరిగిందని, అనుకోకుండా జరిగిన ఈ ఘటనతో అమాయక గిరిజన రైతులపై కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు ఆందోళనబాట పడతారని హెచ్చరించారు.

పేదల మన్ననలు పొందిన లక్ష్మీకాంతారావు

బీఆర్‌ఎస్ నేతలు


కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుస్నాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. అనంతరం మాట్లాడుతూ లక్ష్మీకాంతారావు 40 యేళ్లకుపైగా రాజకీయాల్లో ఉంటూ పేద ప్రజల మన్ననలు పొందారన్నారు. రాష్ట్ర సాధనలో ఆయన ముఖ్యపాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, నియోజకవర్గ పార్టీ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్ రెడ్డి, మండల అధ్యక్షుడు గంగం మధన్ మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకట్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలతో హైరానా

గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతం


హాల్ టిక్కెట్ సరిచూసుకుంటున్న అభ్యర్థులు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో గ్రూప్–3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 13,401 మందికి 37 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల కోసం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలి వచ్చారు. అయితే ఒక్క నిమిషం నిబంధనతో అభ్యర్థులు హైరానా పడ్డారు. పట్టణంలోని ఆయా కేంద్రాల్లో 40 మందిని అనుమతించలేదు. దీంతో వారు పరీక్ష రాయలేని స్థితి ఏర్పడింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లోనే 16 మంది పరీక్షకు దూరమయ్యారు.


పరీక్ష కేంద్రాల వద్ద కోలాహలం


పరీక్షకు వెళ్లే ముందు చిన్నారికి ముద్దుపెడుతున్న తల్లి


గుర్తింపు కార్డులేకపోవడంతో..


పిల్లలకు టాటా చెబుతూ పరీక్షకు వెళ్తున్న తల్లి

'ఇందూరు' పరీక్ష కేంద్రం పరిశీలన

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాల, ఎన్సాన్‌పల్లిలోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల కళాశాలలోని పరీక్ష కేంద్రంలో జరిగిన గ్రూప్–3 పరీక్ష జరుగుతున్న తీరును, పోలీస్ బందోబస్తును కమిషనర్ డాక్టర్ బి.అనురాధ పరిశీలించారు. 12 మంది ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని అనుమతించలేదు.


అధికారులకు సూచనలిస్తున్న పోలీసు కమిషనర్ అనురాధ

కొండపాక ఆధ్యాత్మికతకు నిలయం

పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి

కొండపాక(గజ్వేల్): కొండపాక ప్రాంతం ఆధ్యాత్మికతకు నిలయంగా మారుతోందని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలోని ఆనంద నిలయం ఆవరణలో నిర్మించిన అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణలతో ఉమా రామలింగేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కొలువైన శక్తి పీఠాలను దర్శించుకోవడం ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న అష్టాదశ శక్తి పీఠాలను దర్శించుకున్న పుణ్యఫలం పొందవచ్చన్నారు. వార్షికోత్సం సందర్భంగా రుద్రహోమం, కుంభాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి, ఆనంద నిలయం ట్రస్టు చైర్మన్ లత, ట్రస్టు ప్రతినిధులు నాగరాజు, సంజయ్, రవీందర్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఠాధిపతి విద్యాశంకర భారతి

రూ.24వేల విలువైన వీల్‌చైర్ అందజేత

సిద్దిపేటరూరల్: మెదడువాపుకు గురై నడవలేని పరిస్థితిలో ఉన్న దీక్షిత్ కుమార్‌కు గ్రామానికి చెందిన గణగోని అశోక్‌గౌడ్ సహాయార్థం రూ.24 వేల విలువైన వీల్‌చైర్‌ను అందజేశారు. మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన బండి దశరథం అంజలి దంపతుల కుమారుడైన దీక్షిత్ ఆరేళ్ల వయస్సులో మెదడువాపు వ్యాధికి గురయ్యాడు. దీంతో అప్పటి నుండి నడవలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్నో ఆస్పత్రుల్లో చూపించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో దీక్షిత్ కుమార్ ఎటు వెళ్ళాలన్నా భారంగా మారింది. విషయాన్ని అశోక్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్ళగా రూ.24వేల ఖరీదైన వీల్‌చైర్‌ను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి, గణేశ్, గ్యారతిరుపతి, నవీన్, బుగ్గరాజు, శ్రీధర్‌రెడ్డి, అంజి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


దీక్షిత్‌తో దాత అశోక్‌గౌడ్ తదితరులు

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బట్టికాడి నర్సాగౌడ్ రోజూ మాదిరిగా తన గేదెను శనివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు ఉదయం వ్యవసాయ బావి వద్దకు వచ్చి చూడగా బోరు మోటారు వద్ద విద్యుత్ వైరు గేదెకు తగడంతో అది అక్కడికక్కడే మరణించింది. గేదె విలువ రూ.75వేల ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నేడు మంత్రి పర్యటన

హుస్నాబాద్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. 7, 11, 13, 17, 19, 20వ వార్డుల్లో రూ.3.70కోట్ల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రమేశ్


రమేశ్

చేర్యాల(సిద్దిపేట): మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా మండల పరిధిలోని కడవేర్గు గ్రామానికి రమేశ్ ఎన్నికయ్యారు. పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య సంఘం సభ్యుల సమావేశంలో నూతన నియామకం చేపట్టారు. సంఘం నేతలు లింగమూర్తి, శ్రీనివాస్, నాగరాజు, ఆంజనేయులు, రవీందర్, సిద్ధిలింగం, నారాయణ, వీరమల్లయ్య, వెంకటేశం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మార్పీఎస్ సమావేశం

గజ్వేల్: స్థానిక కోలా అభిరామ్ గార్డెన్స్‌లో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు ముంబ్రాతి కృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్‌మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఎన్నో.. ఏళ్ల కల నెరవేరింది..

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎన్నో యేళ్లనాటి తారు రోడ్డు కల ఎట్టకేలకు నెరవేరింది. అక్కన్నపేట మండలం గండిపల్లి నుంచి దెక్యానాయక్‌తండా మీదుగా సరిరాంతండా వరకు బీటీరోడ్డు నిర్మాణం పూర్తయింది. అయితే ఈ తండాలకు దాదాపుగా 50 యేళ్లకు పైగా బీటీరోడ్డు సౌకర్యం లేక మట్టిరోడ్డుతో నానా అవస్థ పడ్డారు. గుంతలతో పాటు కాలినడకన కూడా ప్రయాణించలేని దుస్థితిలో తండా రోడ్డు ఉండేవి. ఈ క్రమంలో 2023లో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బీటీరోడ్డు మంజూరు కావడంతో పనులు చివరిదశకు చేరుకున్నాయి. దీంతో ఈ తండావాసులు సంతోషం వ్యక్తం చేశారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తండావాసులు కృతజ్ఞతలు చెప్పారు.


గండిపల్లి నుంచి సరిరాంతండా వరకు నిర్మించిన బీటీ రోడ్డు

నల్లా.. బంద్

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): వృథాగా భగీరథ తాగునీరు లీకవుతున్న నల్లాను అధికారులు బంద్ చేశారు. 'వృథాగా భగీరథ' శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. అక్కన్నపేట మండలం పంతుల్‌తండా రోడ్డు పక్కనే భగీరథ తాగునీరు పోతున్న నల్లాను బంద్‌చేసి పూడ్చేశారు. అధికారులకు తెలియకుండా నల్లా కనెక్షన్ ఇచ్చారు. దీంతో పలుమార్లు ఆన్‌ఆఫ్ బిగించినా అది సరిగా పనిచేయలేదని, దీంతో పూర్తిగా నల్లానే పూడ్చేశామని అధికారులు చెప్పారు.


అధికారులు పూడ్చివేసిన నల్లా

ముక్కు మూసుకోవాల్సిందే..

దుబ్బాక: మున్సిపాల్టీ పరిధిలోని 12వ వార్డులో డ్రైనేజీలు అధ్వానంగా తయారు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వార్డులోని పలు కాలనీల్లో మురుగు కాలువల్లో చెత్త, చెదారం, గడ్డి నిండిపోయాయి. దీంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని, రోగాల భారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీలు శుభ్రపరిచి తమ బాధలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


12వ వార్డులో అధ్వానంగా డ్రైనేజీ

అ'పూర్వ' సమ్మేళనం

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2008–2009 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆ విద్యార్థుల్లో ఎన్ఫోర్స్‌మెంట్ శాఖలో ఎస్ఐగా ఎంపికైన సాయి ప్రసాద్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు తీగల సత్యనారాయణ గౌడ్, సోమగారి నాగిరెడ్డి, పరపాటకం అంజిరెడ్డి, తాతిరెడ్డి, హనుమారెడ్డి పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సోషల్ మీడియా కో–కన్వీనర్‌గా సదానందం

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కో–కన్వీనర్‌గా మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన తాటికొండ సదానందాన్ని నియమిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి స్థానిక కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. సదానందం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, ఆగంరెడ్డి, చిరంజీవులు, శ్రీకాంత్, రాకేశ్‌కృష్ణ, శంకరాచారి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న సదానందం

సీపీఎం మండల కార్యదర్శిగా అరుణ్‌కుమార్



చేర్యాల(సిద్దిపేట): సీపీఎం మండల కార్యదర్శిగా బండకింది అరుణ్ కుమార్ గౌడ్ ఎంపికయ్యారు. పట్టణ కేంద్రంలో శనివారం జరిగిన 8వ మండల మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండల కమిటీ సభ్యులుగా వెంకట్‌మావో, శ్రీనివాస్, కనుకయ్య, కుమార్, శ్రీకాంత్, రమేశ్, ఎండి కరీమ్, సంపత్, ఇంద్రం, తిరుపతి ఎంపికైనట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

సిద్దిపేటకమాన్: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఓ బాధితుడిని గుర్తించి ట్రాఫిక్ కానిస్టేబుల్ అతడికి అప్పగించిన ఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. ట్రాఫిక్ కానిస్టేబుల్ మల్లేశం పట్టణంలోని రైతు బజార్ వద్ద విధులు నిర్వహిస్తుండగా రోడ్డు పైన సెల్‌ఫోన్ దొరికింది. చుట్టుపక్కల వారిని విచారించగా ఎవరూ స్పందించలేదు. సీసీ కెమెరాల ద్వారా బాధితుడిని గుర్తించి సెల్‌ఫోన్‌ను ట్రాఫిక్ కానిస్టేబుల్ అతడికి అందజేశారు. ఆ బాధితుడు కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరికొయ్యలు కాల్చొద్దు

● దెబ్బతింటున్న భూసారం ● దిగుబడిపై ప్రభావం ● కలియదున్నితేనే మేలు

చిన్నకోడూరు(సిద్దిపేట): వానాకాలం సీజన్‌లో సాగుచేసిన వరి పంట కోతలు 80శాతం పూర్తయ్యాయి. ఇంకా 20శాతం కోయాల్సి ఉంది. అయితే రైతులు యాసంగి పనులపై దృష్టి సారించారు. ఎక్కువ మంది రైతులు హార్వెస్టర్‌లతో వరి కోతలు చేపట్టారు. దీంతో కొయ్యలు కాస్త పెద్దవిగా ఉంటాయి. వాటిని తొలగించేందుకు అధనంగా ఖర్చవుతుందని భావించిన రైతులు మంట పెట్టి కాలుస్తున్నారు. ఆ వేడివల్ల భూమిసారం కోల్పోతోంది. వరి కొయ్యలను కలియదున్నడం వల్ల సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుంది. దుక్కి దున్నేప్పుడు సూపర్ పాస్ఫేట్ చల్లితే రెండు వారాల్లో కర్రు మురుగుతుంది. భూమికి పోషకాలు అంది డీఏపీ వాడకం తగ్గుతుంది. ఖర్చులు ఆదా అవుతాయి. కలియదున్నితే ఎకరాకు టన్ను ఎరువు తయారవుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

పోషకాలు నష్టపోయే ప్రమాదం

వరి కొయ్యలు కాల్చితే ఆవేడిమి వల్ల భూమిలోని నైట్రోజన్, పాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఆవిరవుతాయి. మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతింటాయి. నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. కాల్చగా వచ్చిన పొగతో వాతావరణం కూడా దెబ్బతింటుంది. యేటా ఇలా కాల్చడంతో వాయు కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉంది. వరి కొయ్యలు తగులబెట్టిన ప్రాంతంలో భూమి బిగువగా మారి నీటిని పీల్చుకునే గుణాన్ని కోల్పోయే అవకాశం ఉంది. వరి కొయ్యలను భూమిలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది.

సూచనలు పాటించాలి



ప్రశాంత్ నగర్(సిద్దిపేట): యాసంగి పంటకు సిద్ధం అవుతున్న రైతులు వరి కొయ్యలను కాల్చవద్దు. కలియదున్నితేనే మేలు. అధికారుల సూచనలు సలహాలు పాటించాలి. పొలం దున్నే ముందు సింగిల్ సూపర్ పాస్ఫేట్ చల్లితే కొయ్యలు త్వరగా కుళ్లిపోతాయి.

– రాధిక,
జిల్లా వ్యవసాయశాఖ అధికారి


వరి కొయ్యలు కాలుస్తున్న రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ జయంత్

భూమి నిస్సారమవుతుంది

గజ్వేల్: వరి కోతలు పూర్తయిన తర్వాత రైతులు మొదళ్లను తగులబెడితే భూమి నిస్సారమవుతుందని ఏడీఏ బాబునాయక్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మొదళ్లను తగులబెట్టడం వల్ల భూములను సారవంతం చేయడానికి దోహదపడే సూక్ష్మజీవులు కాలిపోతాయని చెప్పారు. ఇది తెలుసుకోకుండా రైతులు వరి మొదళ్లను తగులబెట్టడం వల్ల తీవ్రంగా నష్టం జరుగుతోందని, ఒక్కసారి పొలాన్ని కాలబెడితే పాతిక సంవత్సరాలు వెనుకకుపోయినట్టే అన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

– ఏడీఏ బాబునాయక్

పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయి



సిద్దిపేటఅర్బన్: వరి కోతల అనంతరం పంట పొలాలలో మిగిలిపోయిన వరి పంట అవశేషాలను రైతులు కాల్చవద్దని సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయాధికారి బి.శ్రీనాథ్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వరి దుబ్బులు, గడ్డిని భూమిలో దున్ని మురిగేటట్టుచేస్తే ఎకరానికి 10ట్రాక్టర్ల పేడ వేసినంత సేంద్రీయ పదార్థం భూమికి అందుతుందన్నారు. ఖర్చు లేకుండా భూమిలో సేంద్రీయ పదార్థం లభిస్తుంటే రైతులు దానిని కాల్చి భూములను నిస్సారంగా చేసుకోవద్దని సూచించారు.

– అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్

భూమిలో కలియదున్నండి

– ఏఓ వెంకట్రావమ్మ

కొమురవెల్లి(సిద్దిపేట): రైతులు కోతల అనంతరం వరి కొయ్యలను కాల్చవద్దని, భూమిలోనే కలియదున్నాలని మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ వరి కొయ్యలు కాల్చడం వల్ల పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించిపోతాయని దానితో పంట దిగుబడి తగ్గుతుందన్నారు. సేంద్రియ పదార్థాలు భూమిలో కుళ్లిపోవడానికి పంటల వ్యర్థాలు సహకరిస్తాయని చెప్పారు. ఒక్కసారి వరి దుబ్బలను భూమిలో దున్ని ముగిరించితే.. 100 ట్రాక్టర్ డబ్బాల సేంద్రీయ పదార్థాలను భూమిలో వేసినంత ఫలితం ఉంటుందని తెలిపారు. ఒక్కసారి పొలంలో వరి కొయ్యలు కాల్చితే వ్యవసాయం 25యేళ్ల వెనక్కి వెళ్తుందని, లాభం కలిగించే సూక్ష్మజీవులను కాపాడుకోవాలి కాని కాల్చవద్దని సూచించారు.